# ఎదురు కాల్పుల పేరుతో రాజ్యం సాగిస్తున్న బీభత్సాన్ని ఖండించండి

---

**2016** అక్టోబర్ 24న ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ మరియు ఒడిషాకు చెందిన ఎస్‌ఓజిల సంయుక్త పోలీసు చర్యలో – ఒడిషాలోని మల్కన్‌గిరి జిల్లా, పనసపుట్టు గ్రామంవద్ద సిపిఐ(మావోయిస్టు)కు చెందిన నాయకులను, కార్యకర్తలను మరియు ఆదివాసీ ప్రజలను మొత్తంగా 24 మందిని కాల్చి చంపారు. అదే అటవీ ప్రాంతంలో అక్టోబరు 25వ తేదీన మరో నాలుగు మృతదేహాలను కనుగొన్నారు. దీనితో మొత్తంగా మృతుల సంఖ్య 28కి చేరింది. తమ భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన 'ఎన్‌కౌంటర్'లో వీరంతా మృతిచెందినట్లుగా పోలీసులు ప్రకటించారు. కానీ, వాస్తవాలను పరిశీలిస్తే, పకడ్బందీ పథకం రూపొందించి, తదనుగుణంగా క్రూరంగా అమలుచేసిన ఘోరమైన హత్యలని తేటతెల్లమవుతోంది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, చట్టబద్ధపాలనలపై ప్రమాణంచేసిన పాలకులు నగ్నంగా వాటిని ఉల్లఘించారని స్పష్టమౌతోంది. 'కూంబింగ్'ల పేరుమీద ప్రజలపై సాగిస్తున్న రాజ్యబీభత్సాన్ని, భీభత్సకర పద్ధతులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ ప్రాంతంలో ప్రజలపై సాగిస్తున్న ఊచకోతను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం.

కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ అధికారంలో వున్న పాలకులు మనదేశంలో సహజ సంపదలను, మానవవనరులను సామ్రాజ్యవాదులకు అమ్మివేసే తమ విధానాలను కొనసాగిస్తున్నారు. అమెరికా ఆధిపత్య వ్యూహంతో వారు భారతదేశాన్ని ఓ సాధనంగా మలిచారు. పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల, ఫ్యూడల్ అనుకూల విధానాలు, మన ప్రజానీకంలోని అన్ని సెక్షన్లను, వారి జీవితాలలోని అన్ని పార్శ్వాలను ఘోరమైన సంక్షోభంలోకి పడదోశాయి. మన ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడులను పాలకులు తీవ్రం చేశారు. మతతత్వం, ప్రాంతీయతత్వం, కులతత్వం, జాతీయ దురభిమానాలను మరియు ఫాసిస్టు ధోరణులను ప్రయోగిస్తూ ప్రజానీకపు వాస్తవిక సమస్యల నుండి ప్రక్కదోవ పట్టించి, ప్రజలలో చీలికలు కల్పించటానికి పాలకులు అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి ప్రజానీకం తీవ్రంగా సంఘర్షణ పడుతున్నారు.

తీవ్రవాద రాజకీయాలు, ఆచరణలు ఏ రూపంలోనూ ప్రజలకు తోడ్పడకపోగా, వారికి హాని కలుగ జేస్తాయని మేము స్పష్టంగా వున్నాం. దోపిడీ పాలకవర్గాల విధానాలకనుగుణంగా నిజబాధితులైన ప్రజానీకాన్ని వారి జీవితాల రక్షణకోసం, వారి ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకొనేందుకు, మెరుగైన భవిష్యత్తును సాధించుకొనేందుకు సమాయత్తపరిచి సంఘటిత పరచటమే ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు తెచ్చేందుకు అంకితమైన వారందరిముందున్న జరూరైన, అత్యావశ్యక కర్తవ్యం.

**విశ్వం**
ప్రధాన కార్యదర్శి
**కేంద్రకమిటి, సిపిఐ(ఎం-ఎల్)**

**26-10-2016**

○○○○○○